

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎంఎస్సీ ఫారెస్ట్రీ, ఫిషరీస్ కోర్సుల మంజూరు

కామారెడ్డి టౌన్, జూలై 11:కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎంఎస్సీ ఫారెస్ట్రీ, ఫిషరీస్ కోర్సులు మంజూరైనట్లు కళాశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఒకటి రెండు చోట్ల తప్ప తగినన్ని పీజీ సీట్లు అందుబాటులో లేవని తెలిపారు. కోర్సుల మంజూరు కావడం పట్ల వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అకాడమిక్ కో ఆర్డినేటర్ శంకరయ్య, పీజీ కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు.

పంటలు.. సాగయ్యేదెలా?



వరి నాట్లు వేస్తున్న కూలీలు



నారుమళ్లు వేసిన దృశ్యం

- జిల్లాలో నెలకొంటున్న వర్షాభావ పరిస్థితులు
- వర్షాల కోసం అన్నదాతల ఎదురుచూపులు
- ప్రధాన ప్రాజెక్టుల్లోనూ అంతంత మాత్రంగానే సాగు నీరు
- ఊపందుకోని వరి నాట్లు
- ఆరుతడి పంటల సాగుపై ప్రభావం

కామారెడ్డి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ నెల గడిచినా వర్షాలు సమృద్ధిగా కురువకపోవడంతో రైతులు వరి నాట్లు వేసేందుకు ముందుకు రావడం లేదు. ఈ సీజన్‌లో జిల్లాలో ఇప్పటి వరకు పెద్దవర్షాలు పడలేదు. బోర్లు లేని చోట రైతులు నారుమళ్లను రక్షించుకోవడానికి తంటాలు పడుతున్నారు. నారుమళ్లు ముదిరిపోతున్నా వర్షాభావ పరిస్థితులతో నాట్లు వేయడానికి రైతులు సాహసించడం లేదు. గత వారం రోజులుగా జిల్లాలో వర్షాలు లేకపోవడంతో ఆరుతడి పంటలపై ప్రభావం పడుతోంది. గత నెల చివరిలో చిరుజల్లులు పడడంతో ఆరుతడి పంటలకు ప్రాణం పోసినట్లయింది. తర్వాత వర్షాలు లేకపోవడంతో సోయా, పత్తి, మొక్కజొన్న, పప్పు దినుసు పంటలు వాడిపోతున్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. 13 మండలాల్లో సాధారణం కంటే తక్కువే వర్షపాతం నమోదైంది. కనీసం ప్రధాన ప్రాజెక్ట్‌ల్లోనూ సాగునీరు లేదు. ప్రాజెక్టులు అడుగంటిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వానాకాలం సీజన్‌లో పంటల సాగు సాగయ్యేదెలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే కాని పంటల సాగు ముందుకు సాగే పరిస్థితి లేదు.

2 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు

జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురువకపోవడంతో పంటల సాగుపై ప్రభావం పడుతోంది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 5.14 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అయితే ఇప్పటి వరకు 2.05 లక్షల ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. వర్షభావ పరిస్థితులు వరి పంట సాగుపై ప్రభావం చూపుతోంది. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3.13 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు 53,168 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడ్డాయి. వర్షాలు లేకపోవడంతో వరి నారు మళ్లు ముదిరిపోతున్నాయి. నాట్లు వేసేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. ఆరుతడి పంటల సాగు మాత్రం కాస్త ఆశాజనకంగా ఉంది. ఈ సీజన్‌లో సోయా 75,444 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు 63,424 ఎకరాల్లో సాగైంది. పత్తి 28,730 ఎకరాలకు గాను 23,521 ఎకరాల్లో సాగైంది. మొక్కజొన్న 57,315 ఎకరాలకు గాను 21,519 ఎకరాల్లో సాగైంది. కందులు 13,961 ఎకరాలకు గాను 12,794 ఎకరాల్లో, మినుములు 5,263 ఎకరాలకు గాను 9,812 ఎకరాల్లో, పెసర్లు 4,997 ఎకరాలకు గాను 4,314 ఎకరాల్లో సాగయ్యాయి.

అడుగంటిన ప్రాజెక్టులు

జిల్లాలో వర్షాధార పంటలతో పాటు ప్రాజెక్టులు, చెరువులు, కుంటలపై ఆధారపడి రైతులు లక్షల ఎకరాల్లోనే పంటలు సాగు చేస్తుంటారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఆశించిన మేర వర్షాలు లేకపోవడంతో పంటల సాగు ముందుకు సాగడం లేదు. అడపాదడప కురిసిన చిరుజల్లులకు ఆరుతడి పంటలను మాత్రం రైతులు సాగు చేస్తున్నారు. అయితే 3 లక్షల ఎకరాలకు పైగా వరి సాగు కావాల్సి ఉంది. కానీ భారీ వర్షాలు లేకపోవడంతో వరి నాట్లు ఊపందుకోవడం లేదు. మరోవైపు జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలాలు అడుగంటాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు మినహాయిస్తే కౌలాస్, పోచారం ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీకి చేరాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులోను మూడు టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుపై ఆధారపడి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు లక్ష ఎకరాలకు పైగా పంటలు సాగవుతాయి. ఇప్పటికే వరి నాట్లకై సాగు నీటిని విడుదల చేశారు. అయితే ఎగువన ఉన్న సింగూర్ ప్రాజెక్టులో 13 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉంది. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే సింగూర్ నుంచి నిజాంసాగర్‌కు రావాల్సిన వాటా కింద నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఆ ప్రాజెక్టులోను నీటి నిల్వ ఆశాజనకంగా లేదు. అయినప్పటికీ నిజాంసాగర్ ప్రాజెక్టులోకి గోదావరి, సింగూర్ నీటిని తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో లోటు వర్షపాతం

జిల్లాలో లోటు వర్షపాతమే నమోదైంది. జూన్ చివరి వారంలో ఓ మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ గత వారం రోజులుగా వరణుడు ముఖం చాటేశాడు. జిల్లాలో జడివానలే కరువయ్యాయి. పెద్ద వర్షాలు లేకపోవడంతో వరి సాగుపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రాజెక్టులు చెరువులలోకి నీరు చేరక బోసిపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 178మి.మీ.ల వర్షపాతం మాత్రమే నమోదైంది. గత ఏడాది ఈ సమయానికి 216 మి.మీ వర్షం కురిసింది. అంటే 38శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. జిల్లాలో 13 మండలాల్లో సాధారణం కంటే తక్కువే వర్షాపాతం నమోదైంది. జుక్కల్, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, సదాశివనగర్, రాజంపేట, భిక్కనూర్, కామారెడ్డి, రామారెడ్డి, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, పల్వంచ మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. మద్నూర్, బిచ్కుంద, బీర్కూర్, బాన్సువాడ, నాగిరెడ్డిపేట, లింగంపేట, గాంధారి, తాడ్వాయి, డోంగ్లీ మండలాల్లో సాధారణ వర్షాపాతం నమోదైంది. నస్రుల్లాబాద్ మండలంలో మాత్రం సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసింది.

పోచారం కాలువలో.. నీరు పారేదెలా?

- ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడిక, గడ్డి, పిచ్చి మొక్కలు
- ఖరీఫ్‌లో చివరి ఆయకట్టు వరకు నీరందడం ప్రశ్నార్థకమే
- నిధులు మంజూరు లేక ఉపాధి కూలీలతో ప్రధాన కాలువలో పూడికతీత పనులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నీటి పారుదల శాఖ అధికారులు

నాగిరెడ్డిపేట, జూలై 11 : నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన వేల ఎకరాల పంటలకు సాగు నీరందించే పోచారం ప్రధాన కాలువ అధ్వానంగా మారింది. ప్రధాన కాలువలో పూడికతో పాటు, గడ్డి, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో నీటి ప్రవాహానికి అడ్డుకట్టగా మారాయి. దీంతో ప్రస్తుతం ఖరీఫ్‌లో పోచారం ప్రాజెక్టు చివరి ఆయకట్టు భూములకు నీరందడం ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే ప్రధాన కాలువలోని పూడిక, పిచ్చి మొక్కలను తొలగించి ప్రధాన కాలువను శుభ్రం చేయాల్సిన నీటి పారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడిక, పిచ్చి మొక్కలు తొలగిపోకుండా మరింతగా పేరుకుపోతున్నాయి. వర్షాలు కురిస్తే ప్రధాన కాలువలో పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు పనులు జరిగే అవకాశం ఉండదు. ప్రస్తుతం వర్షాలు కురవడం లేనందున ప్రధాన కాలువను శుభ్రం చేసే పనులు వెంటనే చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బంజార తండా వద్ద పోచారం ప్రధాన కాలువలో పేరుకుపోయిన గడ్డి, పిచ్చి మొక్కలు

17వేల ఎకరాలకు సాగు నీరు అందించే ప్రధాన కాలువ

పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ఖరీఫ్, రబీ సీజన్లలో నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన సాగు భూములకు నీరందిస్తారు. ప్రతీయేటా ఖరీఫ్‌లో రెండు మండలాలకు చెందిన 17 వేల ఎకరాల పంటల సాగు భూములకు ఈ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందిస్తారు. యాసంగి సీజన్‌లో మాత్రం ఒక సంవత్సరం నాగిరెడ్డిపేట మండలానికి, ఒక సంవత్సరం ఎల్లారెడ్డి మండలానికి చెందిన పంటల సాగుకు ఈ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందిస్తారు. రెండు మండలాల సాగు భూములకు సాగు నీరందించే ప్రధాన కాలువ పరిస్థితి ప్రస్తుతం అధ్వానంగా మారింది. ప్రధాన కాలువలో పూడికతో పాటు గడ్డి, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో నీటి ప్రవాహానికి అవి అడ్డుకట్టగా మారాయి. దీంతో ప్రస్తుత వర్షాకాలంలో పోచారం ప్రాజెక్టు నిండి, ఖరీఫ్ పంటల సాగు కోసం ప్రధాన కాలువ ద్వారా నీరు విడుదల అయితే చివరి ఆయకట్టు భూములకు నీరందడం కష్టతరంగా మారింది.

ఉపాధి కూలీలతోనైనా ప్రధాన కాలువను శుభ్రం చేయాలి

పోచారం ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడికను, పిచ్చి మొక్కలను గతంలో పలుమార్లు ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టేవారు. ఉపాధి కూలీల చేత ప్రధాన కాలువలను శుభ్రం చేసే వారు. నీటి పారుదల శాఖ అధికారులు, ఈజీఎస్ అధికారులతో సంప్రదించి ఉపాధి కూలీల ద్వారా ప్రధాన కాలువ పూడికతీత పనులు చేపట్టి ప్రధాన కాలువను శుభ్రపరిచారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా నీటి పారుదల శాఖ అధికారులు ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడిక, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడికను, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించాలని, ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పూడికతీత కోసం నిధులు మంజూరు చేయాలి

పోచారం ప్రధాన కాలువలో పూడికతీత కోసం ప్రధాన కాలువలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించడం కోసం ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయడం లేదు. పోచారం ప్రధాన కాలువ సుమారు 58 కిలో మీటర్ల పొడవు కలిగి ఉంది. పోచారం గ్రామం నుంచి ఈ ప్రధాన కాలువ ప్రారంభమై ఆయకట్టు చివరి వరకు వివిధ గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపుతూ వెళుతోంది. ప్రధాన కాలువలో పూడిక, పిచ్చి మొక్కలు లేకుండా ఉంటే చివరి ఆయకట్టు వరకు సాగు నీరు సునాయాసంగా వెళ్లే అవకాశం ఉంటుంది. కాలువలోని పూడికతీత పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రధాన కాలువలో పూడిక పేరుకుపోతుందని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రధాన కాలువలో పూడికతీత కోసం కాలువ మేయింటనెన్స్ కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

పూడిక తీసేందుకు నిధులు లేవు

• వెంకటేశ్వర్లు, నీటి పారుదల శాఖ డీఈఈ, ఎల్లారెడ్డి

పోచారం ప్రధాన కాలువలో పూడిక తీసేందుకు నిధులు లేవు. ప్రధాన కాలువలో పనులు చేసేందుకు నిధులు మంజూరు కావడం లేదు. గత సంవత్సరం ఒక రూ.లక్షా 20వేలతో అత్యవసరం ఉన్న చోట నాగిరెడ్డిపేట వద్ద పూడికతీత పనులు జరిపాం. ప్రస్తుతం నిధులు లేనందున ఉపాధిహామీ పథకం ద్వారా ప్రధాన కాలువలో పూడికతీత పనులు జరిపేందుకు కృషి చేస్తాం. ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు అన్ని విధాల కృషి చేస్తాం.

నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూలై 11: నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే, ఆర్‌డబ్ల్యుఎస్, ఈడబ్ల్యుఐడీసీ, టీజీ ఎంఐడీసీ, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు, డీడబ్ల్యుఓ, డీఈవో, సీపీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలతో పాటు ఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్టీ, సీడీపీ తదితర నిధులతో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్, టీజీఈడబ్ల్యుఐడీసీ, టీఎస్ఐడీసీ, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల ద్వారా రోడ్లు, వివిధ శాఖల భవనాల నిర్మాణాలు, కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల పెండింగ్ పనులు, మెడికల్ కాలేజ్, హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల అభివృద్ధి, అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి, మిషన్ భగీరథ తాగునీరు సరఫరాల, నేషనల్ హైవే పెండింగ్ పనులు తదితర అన్ని నిర్మాణ పనులలో అలసత్వం ప్రదర్శించకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ విభాగం ద్వారా చేపట్టిన పనుల పురోగతి నెమ్మదిగా ఉందని ఆ శాఖ అధికారులు పనుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో ఘనంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, జూలై 11: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జగన్నాథ రథయాత్ర కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ రథయాత్రను ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రథయాత్ర సర్దార్ వల్లబబాయ్ పటేల్ చౌరస్తా నుంచి నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, మున్సిపల్ ఆఫీస్, రైల్వేకమాన్, స్టేషన్‌రోడ్డు, తిలక్‌రోడ్డు, జేపీఎన్ రోడ్డు, రామారెడ్డి చౌరస్తా మీదుగా చివరకు కన్యాకా పరమేశ్వరీ ఫంక్షన్‌హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి, సామరస్యంతో ఉండాలని ఇస్కాన్ రథయాత్ర చేయడం హర్షించదగిన విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఇస్కాన్ అధ్యక్షుడు వెంకట్‌దాస్, నిజామాబాద్ అధ్యక్షుడు శ్రీమాన్ సిద్ధ బలరాం తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ బస్టాండ్ ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరు

నిజాంసాగర్, జూలై 11: ఎన్నో ఏళ్లుగా నిజాంసాగర్ బస్‌స్టేషన్ ఆవరణ ప్రహరీ నిర్మాణానికి నోచుకోలేదు. బస్‌స్టేషన్ 18 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉండేది. పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి, పల్లె ప్రకృతి వనాలు ఆర్టీసీ స్థలంలోనే నిర్మాణం చేపట్టారు. కాలక్రమేణా బస్‌స్టేషన్ కేవలం 5 ఎకరాలకే పరిమితమైంది. బస్ స్టేషన్ స్థలం కబ్జాకు గురైంది. ఆధునికీకరణలో భాగంగా బస్ స్టేషన్ ఆవరణ సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టింది. విద్యుద్దీకరణ, బల్లాలను ఏర్పాటు చేసింది. కానీ ప్రహరీ నిర్మాణం చేపట్టలేదు. ఇటీవల ఉన్నతాధికారులు రూ.28లక్షలు కేటాయించారు. ఈ నిధులతో పోలీస్‌స్టేషన్ నుంచి మొదలుకొని ఇరిగేషన్ రహదారి వెంట ఉన్న ఆర్టీసీ స్థలం నుంచి ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నారు. మిగిలిన 5 ఎకరాల స్థలం కబ్జాదారులు కబ్జా చేసేందుకు వీలు లేకుండా పోతోంది. ఆర్టీసీ యంత్రాంగం బస్టాండ్‌కు కలరింగ్ పనులు చేపట్టకపోవడంతో కళాహీనంగా మారింది. ఏళ్ల క్రితం నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉపాధి హామీ పథకం కింద మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు శంకుస్థాపన చేశారు. ప్రజా ప్రతినిధులు నిర్మాణానికి శ్రీకారం చుట్టలేదు. తెలుగు గ్రామీణ పథకం కింద 1989లో రూ.18లక్షలతో బస్ స్టేషన్ చేపట్టారు. 4 ప్లాట్‌ఫారంలు నిర్మించారు. రాష్ట్ర రాజధానిలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఆయా ప్రాంతాల నుంచి సర్వీసులు వస్తూ పోతూ ఎంతో మంది ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేర్చే వారు. ప్రహరీతో నూతన కళ రానుందని స్థానికులు పేర్కొంటున్నారు.



నిజాంసాగర్ ఆర్టీసీ బస్టాండ్

రెంజల్‌లో సెల్‌ఫోన్ రికవరీ

రెంజల్, జూలై 11: మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన రాము కొన్ని రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోయిందని రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దొంగిలించబడిన సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని గురువారం బాధితుడు రాముకు ఎస్ఐ సాయన్న అందజేశారు.

అక్రమ నిర్మాణం పరిశీలన

నవీపేట,జూలై11: మండలంలోని స్టేషన్ ఏరియాలోని ఇరిగేషన్ కార్యాలయం స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని గురువారం ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీలు పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తాము పరిశీలించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇరిగేషన్ కార్యాలయానికి సంబంధించిన ఖాళీ స్థలంలో కట్టిన పరదాలను వెంటనే తొలగించాలని సంబంధిత ఇంటి యాజమానిని ఆదేశించారు. అక్రమ నిర్మాణం చేపట్టడం నేరమన్నారు.

'మాక్లూర్ హైస్కూల్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయండి'

మాక్లూర్, జూలై 11 : మాక్లూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ పాఠశాల నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి జన్నా రఘు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. పాఠశాల, కళాశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పాఠశాల నిర్మాణపనులు నత్తనడకన సాగుతున్నాయని, వెంటనే నిర్మాణపనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అనం తరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో పీడీఎస్‌యు నాయకులు స్నేహిత్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మాజీ ఐపీఎస్ అధికారి సంతకాన్ని
ఫోర్జరీ చేసిన నిందితుల అరెస్టు

నవీపేట, జూలై 11 : మాజీ ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు.

మండలంలోని పొతంగల్‌కు చెందిన మగ్గిడి అనిల్‌కు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్(పీసీసీ) ఇప్పిస్తామని నిజామాబాద్‌కు చెందిన దరిసింగ్ అనే ఏజెంట్‌తో పాటు ఆర్మూర్‌కు చెందిన అతని సహాయకుడు దినాకర్‌లు ఫోర్జరీ పత్రాలను సృష్టించిన విషయం విధితమే. ఈ విషయంపై ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నిందితులైన దరిసింగ్, దినాకర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఈ సందర్భంగా తెలిపారు.

'రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

కామారెడ్డి టౌన్, జూలై 11:రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు అన్నారు. గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి ఏవో అహ్మద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌సీజన్ ప్రారంభమై నెలరోజుల పైబడినా రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పేరుతో ఇచ్చిన హామీని నెరవేర్చలేక పోవడం దురదృష్టకరమని అన్నారు. మెనిఫేస్టోలో పేర్కొన్న విధంగా కాకుండా సబ్‌కమిటీలు అభిప్రాయాల పేరుతో కాలయాపన చేయడం విడ్డురమని తెలిపారు. ఇక రెండు లక్షల రూపాయల వ్యవసాయ రుణమాఫీ పథకం విషయంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 200 రోజులు గడుస్తున్నా ఈ ప్రభుత్వం ఇంకా రైతులను గందరగోళ పరుస్తునే ఉందన్నారు. రుణమాఫీ కాని కారణంగా బ్యాంకుల్లో రైతులు అపరాదుల్లా తలవంచుకోవాల్సి వస్తుందని, కౌలు రైతులకు వ్యవసాయకూలీలకు అందిస్తామని చెప్పిన ఆర్థిక తోడ్పాటు విషయంలో ఈ ప్రభుత్వం ఇంకా నోరు మెదపకపోవడం దుర్మార్గమని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంటల బీమా అమలుచేయకుండా రైతులు ఇబ్బందులు పాలుచేసిందని ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలుచేస్తామని గొప్పలు చెప్పిన ఇంకా కార్యచరణ చేయడం లేదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నవీపేట, జులై 11 : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు సమీపంలో గురువారం కారు, బైక్ ఢీకొనడంతో మండలంలోని మహంతంకు చెందిన సంగెం రఘుపతి అనే 52 సంవత్సరాల వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన ప్రకారం మహంతంకు చెందిన రఘుపతి పొలంలో గడ్డిమందు కొనుక్కోవడానికి బైక్‌పై నవీపేట వచ్చాడు. యూనియన్ బ్యాంకులో డబ్బులను డ్రా చేసుకుని రోడ్డుకు అవతలి వైపు ఉన్న పెట్రోల్‌బంక్ వైపు బైక్‌పై వెళ్తుండగా నిజామాబాద్ నుంచి నవీపేట పోలీస్‌స్టేషన్‌లో విధులకు హాజరుకావడానికి ఏఎస్ఐ గఫర్ కారులో వస్తుండగా కారు, బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రఘుపతి తలకు, కాలుకు తీవ్ర గాయాలు కాగా వెంటనే అతనిని మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ఫిర్యాదు

భీమ్‌గల్ రూరల్, జూలై 11 : భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని 882 సర్వే నెంబరు గల అసైన్డ్‌భూమిలో లింబాద్రి గుట్ట వద్ద చేపడుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని భీమ్‌గల్ కాంగ్రెస్ నాయకుడు మల్లెల లక్ష్మణ్ కోరారు. ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ ఆర్‌సీసీ మడిగెలను, రేకులషెడ్డుల నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని గురువారం మున్సిపాలిటీ కమిషనర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయకుండా వుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాకు దిగుతామని పేర్కొన్నారు.

వెల్మల్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నందిపేట, జూలై 11 : మండలంలోని వెల్మల్ గ్రామంలో గురువారం సీసీ రోడ్డుపనులను బీజేపీ నాయకులు ప్రారంభించారు. ఎంపీ నిధులతో గ్రామంలో సీసీరోడ్డు పనులను చేప డుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్, మల్లేష్, రాందాస్, భూమేష్ ప్రవీన్, రవి, మల్లన్న, గంగాధర్ ఉన్నారు.

కాంప్లెక్స్ నిర్మాణం కోసం అద్దెదారులకు నోటీసులు

డిచ్‌పల్లి,జూలై 11: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద షాపింగ్ కాంపెక్స్ నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న దుకాణదారులకు షాపులు ఖాళీ చేయాలని నోటీసులు అందజేసినట్లు కంట్రోలర్ చందర్‌నాయక్ తెలిపారు. త్వరలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి టెండర్లు పూర్తవుతాయని, అందుకనే ముందస్తుగా ఈ నోటీసులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ

డిచ్‌పల్లి, జూలై 11 : గత నెల 24న రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందిన గొనుగంటి నాగేశ్వరరావు కుటుంబాన్ని ధర్మారం(బీ)లో మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వుల్లోల్ల గంగాధర్ గౌడ్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రావుల బ్రహ్మానందం, నాయుడు అంజనేయులున్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డునర్సయ్య

ఆర్మూర్‌టౌన్, జూలై 11 : పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట జిల్లా కోర్టు న్యాయవాది రవికుమార్‌పై జరిగిన దాడికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డునర్సయ్య మాట్లాడుతూ న్యాయవాదుల సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి అరుణ్, న్యాయవాదులు తుమ్మ సుకేష్, తాజోద్దీన్, కృష్ణంరాజు, జగదీష్, శ్రీధర్, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

● బోధన్‌లో..

బోధన్‌రూరల్, జులై 11 : భద్రాచలంలో న్యాయవాదికి పోలీసులు చేతులకు సంకెళ్లు వేసి తీసుకెళ్లడం సరికాదని బోధన్‌బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోశెట్టి అన్నారు. గురువారం బోధన్ కోర్టులో భద్రాచలం న్యాయవాదికి సంకెళ్లు వేసి పోలీసులు కోర్టుకు తీసుకెళ్లినందుకు నిరసనగా వారి విధులను బహిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో న్యాయవాదిపై జరిగిన ఘటన మరువకముందే న్యాయవాదులపై ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం శోచనీయమన్నారు. న్యాయవాదుల భద్రత చట్టం తేవాలని కోరారు. న్యాయవాదులపై దాడులు సైతం జరుగుతున్నాయని వీటిపై చట్టం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కోటేశ్వర్ రావు, సంగం, వాహెద్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

యూఎస్ఎఫ్ఐ డివిజన్ నూతన కమిటీ నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న యుఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి

ఆర్మూర్‌టౌన్ , జూలై 11 : పట్టణంలోని సీవీఆర్ జూనియర్ కళాశాలలో గురువారం యూఎస్ఎఫ్ఐ డివిజన్ నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్దిసూరి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై నిరంతరం ప్రభుత్వంతో పోరాటం చేస్తామన్నారు. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్నభోజన పథకం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందలేదని, తక్షణమే ప్రభుత్వం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. డివిజన్ అధ్యక్షునిగా సిద్దాలనాగరాజు, కార్యదర్శిగా ఎం.జవహార్‌సింగ్, ఉపాధ్యక్షునిగా అభిషేక్, అర్వింద్, సహాయ కార్యదర్శులుగా విగ్నేష్‌నాయక్, సుశీల్‌లను నియమించి వారిని అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలు

బోధన్‌రూరల్, జులై 11 : మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి బోధన్ కోర్టులో రెండురోజుల పాటు జైలుశిక్షను విధిస్తూ బోధన్‌కోర్టు స్పెషల్ మేజిస్ట్రేట్ శేషతల సాయి తీర్పులో వెల్లడించారు. గురువారం ఉదయం బోధన్ కోర్టులో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో షేక్‌ఫారూఖ్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనాన్ని నడిపినందుకు రెండురోజుల జైలుశిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి.. రూ. 70 వేల నగదు స్వాధీనం

కోటగిరి, జులై 11 : పోతంగల్ మండలంలోని జల్లాపల్లి గ్రామంలో బుధవారం రాత్రి పేకాట స్థావరంపై దాడిచేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 70,350 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. 9మంది పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఉమ్మడి మండలంలో ఎక్కడైనా పేకాట నిర్వహిస్తే తమకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ పేర్కొన్నారు.

మానవాళి మనుగడకు మొక్కలు నాటాలి

● నాటిన మొక్కలను సంరక్షించాలి ● ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ● పలు సమస్యలపై వినతులు


పిప్రిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై 11 : భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా మానవాళి మనుగడకు ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అధికారులు నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడు పథకాలు పేర్లు మారుతున్నాయి, మొక్కలు నాటుతున్నప్పటికీ అవి బతకడం లేదని దీంతో ఫలితాలు రావడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిరాం, ఏపీవో ఉమ్మెడ సురేష్, బీజేపీ మండల అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, మాజీఎంపీటీసీ కేసీ.ముత్తెన్న, అధికా రులు, బీజేపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి..

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డొంకేశ్వర్, నందిపేట మండలాల వీఆర్‌ఏలు గురువారం ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 61ఏళ్ళు పైబడి వీఆర్ఏ వారసులను రెగ్యులర్ చేయాలని వారు కోరారు. వీఆర్ఏ వారసులు అర్హత కలిగిన వారు రాష్ట్ర వ్యాప్తంగా 3797మంది ఉన్నారని, వారిని ఇప్పటి వరకు రెగ్యులర్ చేయలేదన్నారు. వీఆర్ఏ వారసులకు ఉత్తర్వులు ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని, అసెంబ్లీలో తమ సమస్యలపై చర్చించి న్యాయం చేయాలన్నారు.

వికలాంగుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి..

నందిపేట మండల వికలాంగుల అసోసియేషన్ సభ్యులు గురువారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని కలిసి వికలాంగుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పింఛన్ పెంపుదల, ఇతర పథకాలలో రిజర్వేషన్‌లను అమలు చేసే విధంగా కృషి చేయాలని వారు కోరారు.

వన మహోత్సవ లక్ష్యాన్ని పూర్తిచేయాలి

● అడిషనల్ కలెక్టర్ అంకిత్

డిచ్‌పల్లి, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేప డుతున్న వనమహోత్సవానికి సంబంధించి పనులు వెంటనే ప్రారంభించాలని, లక్ష్యానికి మించి మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ అంకిత్ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని సుద్దులం, కోరట్‌పల్లి, మెంట్రాజ్‌పల్లి గ్రామాల్లో ఆయన పరిశీలించారు. నాటుతున్న మొక్కలు ఎండ తీవ్రతకు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటింటా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. వనులను రైతు, వేదికను, కంపోస్ట్ షెడ్డు, అవెన్యూ ప్లాంటెషన్‌ను ఆయన పరిశీలించి ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్‌లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా తీసుకుంటున్న దరఖాస్తులను పరిశీలించారు. ఐకేపీ కార్యాలయం తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న యూనిఫాం వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రక్షిత నీటిట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ గ్రామాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఏపీవో సుధాకర్‌రెడ్డి, కార్యదర్శులున్నారు.


సుద్దులంలో ఉపాధి హామీ మొక్కలు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మానాలను కలిసిన కాంగ్రెస్ నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న ఏర్గట్ల కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, జులై 11 : మండలంలోని కాంగ్రెస్ నాయకులు గురువారం తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రస్థాయిలో కార్పోరేషన్ పదవిని చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సోమదేవారెడ్డి, మాజీ జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, సున్నపు అంజయ్య, గడ్డం జీవన్, రొక్కెడ సంజీవ్, రేండ్ల రమేష్, గణేష్‌లు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్ తరలివెళ్లారు. ప్రమాణస్వీకారం అనంతరం పదవీబాధ్యతలు చేపట్టిన మానాల మోహన్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, బుచ్చిమల్లయ్య, ప్రదీప్, శేఖర్, గణేష్ గౌడ్, నల్ల గణేష్ గుప్త, ప్రసాద్, సుంకరి రాజేశ్వర్, జగదీష్, నర్సాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మానాల మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

బోధన్‌రూరల్ : తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మానాల మోహన్ రెడ్డిని బోధన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా బోధన్ సహకార సంఘాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లె రమేష్, మందర్నా రవి, ఖాజాపూర్ అశోక్, వై.నరేందర్ రెడ్డి నాయకులు తదితరులున్నారు.

వేల్పూర్: హైదరాబాద్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన మానాల మోహన్‌రెడ్డిని, అలాగే రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఈరవత్రి అనిల్‌ను వేల్పూర్ మండల కాంగ్రెస్ నాయకులు పూలబొకే, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నందిపేట : మండల కాంగ్రెస్ నాయకులు ఆయనకు పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, పీసీసీ ప్రధానకార్యదర్శి వైఎస్. గంగాధర్, ఆర్మూర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్, నాయకులు తెడ్డుగారి నిఖిల్, దేవిదాస్‌గౌడ్, సిరాజ్ నాగరాజు తదితరులున్నారు.

డొంకేశ్వర్ : మండల కాంగ్రెస్ నాయకులు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన మానాల మోహన్‌రెడ్డిని శాలువాతో సన్మానించి పూలబొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, మారంపల్లి లిఫ్ట్ చైర్మన్ భోజారెడ్డి, శ్యామ్‌గౌడ్, తదితరులున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

బోధన్ రూరల్, జూలై 11 : విద్యుత్తు షాక్‌తో రైతు మృతిచెందాడు. మండలంలోని సాలంపాడ్ క్యాంప్ గ్రామానికి చెందిన మారం రాంబాబు (36) అనే రైతు గురువారం తెల్లవారుజామున పొలంలో నీరు పారించడానికి వెళ్లి విద్యుత్‌షాక్‌తో మృతిచెందినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. మారం రాంబాబు గురువారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో పొలానికి నీరు పారించడానికి వెళ్లాడని, బోరువేసే సమయంలో విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. మృతుడికి భార్య, పిల్లలున్నారని పేర్కొన్నారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భూ వివాదం పరిష్కరించాలని ఆందోళన

ముప్కాల్, జూలై 11 : బాల్కొండ మండల కేంద్రంలోని 1403 సర్వేలో తలెత్తిన భూవివాదం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కులసంఘాలు బాల్కొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశాయి. స్థానిక పెద్దమ్మ ఆలయం వద్ద ఉన్న 1403 సర్వేలోని 16 గుంటలు, 1417సర్వేలో గల 75 గుంటలు పాడిదే లింగన్న గతంలో ముదిరాజ్ కులానికి విక్రయించగా రిజిస్ట్రేషన్ సైతం అయింది. అయితే 1403లోని ఐదుగుంటలు పొరపాటున లింగన్న భార్యపై ఉండడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గత ఏడాది డిసెంబర్ 8న పలువురి సమక్షంలో రిజిస్ట్రేషన్ చేసేందుకు లిఖితపూర్వకంగా ఒప్పుకుంది. కాని ఇటీవల అదే భూమిని మరో ఇద్దరు వ్యక్తుల పేరున ఈ ఏడాది జూన్‌లో రిజిస్ట్రేషన్ చేసింది. వాస్తవానికి నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ఆధారాలు లేకుండా ఆర్మూర్ ఇన్‌చార్జీ సబ్‌రిజిస్ట్రర్‌గా ఉన్న మంద కిరణ్ అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. దీనిపై వెంటనే విచారణ జరిపి రిజిస్ట్రేషన్ రద్దుచేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో వచ్చే వరకు ఆందోళన ఆపేదిలేదని మూడు గంటల పాటు బైఠాయించారు. చివరికి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు.


తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు


వేల్పూర్‌లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేల్పూర్, జూలై 11 : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అం దజేశారు. అంతకు ముందు డాక్టర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, వాటి నుంచి కాపాడుకోవడానికి విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. ప్రతీరోజు భోజనంకు ముందు చేతులను శుభ్రం కడుక్కో వాలన్నారు. బయట ఎలాంటి తినుబండరాలు తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యువో భోజేందర్, ఆరోగ్య కార్యకర్త లత, విద్యార్థులు, తదితరులున్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు గురువారం ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, అన్నం తినే ముందు కాళ్ళు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు సంజీవ్ కుమార్, ఏఎన్ఎం మాధవీలత, ఆశా కార్యకర్తలు రాజమణి, పద్మ, రిబిక, విద్యార్థులు తదితరులున్నారు.

ఫ్యాక్టరీ గేటు ఎదుట కార్మికుల ఉద్యోగ విరమణ


గేటు ఎదుట ఉద్యోగ విరమణ చేస్తున్న కార్మికులు

బోధన్‌రూరల్,జూలై11 : పట్టణంలోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ప్రధాన గేటు వద్ద గురువారం నలుగురు కార్మికులు ఫ్యాక్టరీ గేటు ఎదుటనే ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకుడు నాగేశ్వర రావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఫ్యాక్టరీలో పని చేసిన కార్మికుల ఉద్యోగ విరమణ కార్యక్రమం ఇలా ఫ్యాక్టరీ గేటు ఎదుట చేసుకోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు రఘునాథ్, భూమయ్య, సురాజ్ ప్రసాద్, మొహిన్ బేగ్‌లతో కార్మిక సంఘాల నాయకులు గల్లయ్య, నయీముద్దీన్, లింగం గౌడ్, బషీర్, వికారుద్దీన్, మంగ్యా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన డీఎల్‌పీవో


నందిపేటలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నందిపేట, జూలై 11 : మండల కేంద్రంలోని పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ పరిశీలించారు. వర్షాకాలం సీజన్‌లో ప్రతీరోజు రోడ్లను శుభ్రంగా ఊడ్చి మురికి కాలువలను శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసి శుద్ధమైన నీటిని అందజేయాలని, స్పెషల్‌డ్రైవ్ ఏర్పాటు చేసి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని డీఎల్‌పీవో శివకృష్ణ కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీన్, స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది, తదితరులున్నారు.

మోస్రా చెరువులో పడి మహిళ మృతి

మోస్రా, జులై 11 : మండల కేంద్రానికి చెందిన ముదిగపల్లి బాలవ్వ (60) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందింది. రోజు మాదిరిగానే బుధవారం పశువులు మేపుటకు వెళ్లిన బాలవ్వ బర్రెలు కడుగుతుండగా ప్రమాదవశాత్తు మోస్రా చెరువులో కాలుజారి పడిపోయిందని ఎస్ఐ కృష్ణకుమార్ తెలిపారు. ఊపిరాడక మృతిచెందిందని, మృతదేహాన్ని గురువారం ఉదయం తీయించి, పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఆమె కుమారుడు సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణకుమార్ తెలిపారు.

'విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి'

బోధన్‌రూరల్, జూలై 11: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సీఏ మట్టేష్‌రెడ్డి అన్నారు. గురువారం సాలూర మండల కేంద్రంలోని తగ్గెల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలను, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివి సీఏగా ఉన్నత స్థితిలో ఉన్నానని, ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యాబోధన ఉంటుందన్నారు.

ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్


ఏర్గట్లలో తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి వాజిద్ హుస్సేన్

ఏర్గట్ల, జులై 11: రైతులకు ఇ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికా వాజిద్ హుస్సేన్ తెలిపారు. గురువారం మండలంలోని ఏర్గట్ల, తాళ్ళరాంపూర్ సహకార సంఘాల్లో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ పాస్‌లో నమోదు చేసిన వివరాలను, భౌతికంగా ఉన్న బస్తాలను ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ చేశారు. విక్రయించిన ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏడిఏ కాంపాటి మల్లయ్య, మండల వ్యవసాయాధికారి లావణ్య, సీఈవోలు శ్రీనివాస్, గణేష్‌లు పాల్గొన్నారు.

నవాబ్‌అలీ జంగ్ బహదూర్ జయంతి వేడుకలు

మెండోర, జూలై11: మండలంలోని పోచంపాడ్ ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా నవాబ్‌అలీ జంగ్ బహదూర్ జయంతి వేడుకలను ఇరిగేషన్ అధికారులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవాబ్‌అలీ జంగ్ బహదూర్ హైదరాబాద్ రాష్ట్రానికి చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసి నిజాంసాగర్‌ప్రాజెక్టు నిర్మాణానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్ చక్రపాణి, ఉపపర్యవేక్షక చీఫ్ ఇంజనీర్ లాల్‌సింగ్, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్లు గణేష్, గంగాభూషన్, రఘుపతి, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లు, అక్తరుద్దిన్, శ్రీనయన, రవి, మాణిక్యం, మధురి, డివిజన్ సర్కిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బుస్సాపూర్ పాఠశాల ఉపాధ్యాయులకు వీడ్కోలు

మెండోర, జూలై 11 : మండలంలో బుస్సాపర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి పదోన్నతితో బదిలీపైన వెళ్ళిన భూపతి, అరుంధతి, కిరణ్మయి ఉపాధ్యాయులను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రమేష్ మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయునికి ఉద్యోగ జీవితంలో బదిలీ తప్పదని వారు పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రెంజర్ల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, యుటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఓ.రమేష్, ఉపాధ్యాయులు సాయిరాం, నరహరి, శమంత, నర్మేందర్, రాజేశ్వర్, గంగాధర్, రాజ్యలక్ష్మీ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్ , జూలై11: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో గురువారం విద్యుత్ అధికారులు 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఎస్ఎస్ 279/63 కేవీ ట్రాన్స్ ఫార్మర్ ఉండడంతో లో-వోల్టేజీతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, లైన్‌మెన్ సంతోష్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు రూ.4,116 జీవనభృతి కల్పించాలి

ఆర్మూర్‌టౌన్ , జూలై 11 : బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు రూ.4,116ల జీవనభృతి ఇవ్వాలని తెలంగాణ ప్రగతి శీల బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ముత్తెన్న ఆయన డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన ప్రకారం బీడీకార్మికులకు జీవన భృతిపెంచి ఇవ్వాలని అన్నారు. బీడీవర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు కె.రాజేశ్వర్, జి.అర్వింద్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రత్యేక అధికారిణి

వేల్పూర్, జూలై 11 : మండలంలోని కొనసాగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులను గురువారం ప్రత్యేక అధికారిణి కృష్ణవేణి పరిశీలించారు. వేల్పూర్‌లోని పల్లె ప్రకృతి వనంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం ఇంటింటికి మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

కలగానే మిగిలిన సోయా ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు

- స్థలం గుర్తింపుతోనే సరిపెట్టిన వైనం
- అందుబాటులోకి వస్తే వేలాది మందికి ఉపాధి

మద్నూర్, జూలై 11: అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న జుక్కల్ నియోజకవర్గంలో సోయా ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రం ఏర్పాటు అయినట్లయితే వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వస్తాయని, ఈ ప్రాంతం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్‌గా బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాసుల బాల్‌రాజ్ ఛైర్మన్‌గా ఎంపిక కావడంతో పక్కనే ఉన్న జుక్కల్ నియోజకవర్గం ప్రజల్లో ఆశలు చిగురించాయి. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటు కలగానే మిగిలిపోతుంది. 2021లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటగా జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఆ తరువాత నియోజకవర్గానికి ఒకటి చొప్పున నెలకొల్పాలని భావించింది. వాటి ద్వారా స్థానికంగా యువతకు ఉపాధి దొరుకుతుందని, పార్కులను అభివృద్ధి చేసి స్థానికంగా ఆసక్తి ఉన్న వారికి కేటాయిస్తే ఆహార శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయించే ఆస్కారం ఉంటుందని, అప్పటి ప్రభుత్వం ఉద్దేశం. ఇందులో భాగంగా జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలం అవల్‌గావ్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ స్థలాలను సైతం గుర్తించి కలెక్టర్ల ద్వారా ప్రతిపాదనను తెప్పించుకుంది. కాని మూడేళ్ల పాటు ఈ విషయంలో ఎలాంటి ముందడుగు వేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం కొన్ని చోట్ల మాత్రమే తూతూ మంత్రంగా పార్కులను నెలకొల్పగా చాలా చోట్ల పట్టించుకోలేదు.

స్థల పరిశీలనతోనే సరి

ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటు కోసం గత టీఆర్ఎస్ ప్రభుత్వం స్థల పరిశీలనతోనే సరి పెట్టింది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తామంటూ గొప్పగా చెప్పి అమలులో మాత్రం శ్రద్ధ కనబరచలేదు. జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలం అవల్‌గావ్ శివారులో 281 సర్వే నెంబర్‌లో 5 ఎకరాల 8 గుంటల భూమిని సోయా ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు కోసం ఎంపిక చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం దాని ఊసు తీసుకురాకపోగా ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు జుక్కల్ నియోజకవర్గం పక్కనే ఉన్న బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన నాయకుడు ఛైర్మన్ కావడంతో కాంగ్రెస్ హయాంలో సోయా ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు ఏర్పాటు అవుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఈ పార్కు ఏర్పాటు కోసం నియోజకవర్గం నాయకులు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి నిరుద్యోగుల సమస్య తీర్చడానికి కృషి చేస్తారని ఆశిస్తున్నారు.



మద్నూర్ శివారులో సోయా ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుకు కేటాయించిన స్థలం

వేలాది మందికి ఉపాధి

సోయా ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు ఏర్పాటు చేయటం ద్వారా నియోజకవర్గంలో స్థానికంగా యువతకు, కూలీలకు ఉపాధి దొరికే అవకాశం మెండుగా ఉన్నాయి. గుర్తించిన స్థలాల్లో టీఎస్ఐఐసీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనుగుణంగా ప్లాంట్లను తయారు చేస్తోంది. వీటిని ఆసక్తి ఉన్న ప్రోత్సాహికులకు కేటాయిస్తోంది. దీంతో అటు యూనిట్లు నెలకొల్పిన వారితో పాటు అందులో పని చేయడానికి అవసరమయ్యే కూలీలకు ఉపాధి దొరుకుతోంది. ఒక్కో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులో దాదాపుగా మూడు వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుపై చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న భాగ్యలక్ష్మీ

ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు, పురుగు మందులను విక్రయించాలి

- జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మీ

మద్నూర్, జూలై 11: రైతులకు ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలని, వాటిని ఈపాస్ యంత్రాల ద్వారానే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మీ అన్నారు. గురువారం మండలంలోని మేనూర్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందులు రైతులకు అందుబాటులో ఉంచాలని ఈపాస్ ద్వారానే విక్రయించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక వ్యవసాయ అధికారి రాజు, ఆయా క్లస్టర్ల విస్తీర్ణ అధికారులతో సమావేశం నిర్వహించారు. వానాకాలంలో రైతులు సాగు చేస్తున్న పంటలను స్థానిక వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అందుబాటులో ఉండి పంటలు పరిశీలించాలని రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. సాగు చేస్తున్న పంటల వివరాలను ఎప్పటికప్పుడు సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాజు, ఏఈవోలు అనిల్, ప్రియాంక, బాజన్న, లక్ష్మణ్, సతీష్, నాందేవ్, గజానంద్, సంరీన్, సంయుక్త తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్న జిల్లా సహాయ కమిషనర్

దేవాలయ భూముల బహిరంగ కౌలు వేలం

మద్నూర్, జూలై 11: మండలంలోని మేనూర్ దేవాలయ భూమిని గురువారం బహిరంగంగా కౌలు వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్ సుప్రియ పాల్గొన్నారు. ఆలయానికి సంబంధించిన 14 ఎకరాల 16 గుంటల భూమిని బహిరంగ వేలం పాట నిర్వహించగా, హనుమంతు అనే రైతు ఎనిమిది లక్షల 51 వేలకు దక్కించుకున్నారు. ఏడాది పాటు ఆ రైతు ఈ భూమిలో పంటలు పండించుకోవచ్చని దేవాదాయ శాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారులు శ్రీధర్, రవీందర్ గుప్త, వేణు, ఆలయ జూనియర్ అసిస్టెంట్, పరిశీలకులు కమల, మాజీ సర్పంచ్ విఠల్ గురాజీ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్య అవార్డు అందుకుంటున్న రవీంద్ర మోహన్

ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి లక్ష్య అవార్డు

ఎల్లారెడ్డి, జూలై 11: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి లక్ష్య అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును గురువారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ విజయ లక్ష్మీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి పాల్గొన్నారు.

రాజంపేటలో ఉపాధి హామీ సోషల్ ఆడిట్

రాజంపేట, జూలై 11: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సిబ్బందితో ఎంపీడీవో రాజేశం సమావేశం నిర్వహించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు చేసిన పనులపై ఆడిట్ నిర్వహించారు. శుక్రవారం నుంచి సభ్యులు గ్రామాలకు వెళ్లి ఆడిట్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రఘురాం, ఏపీవో, టీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు ఇసుక టిప్పర్ల పట్టివేత

బిచ్కుంద, జూలై 11: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు టిప్పర్లను పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. హస్గుల్ క్వారీ నుంచి అక్రమంగా టిప్పర్‌ల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన టిప్పర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు

బిచ్కుంద, జూలై 11: బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 'జాతీయ విద్యా విధానం'పై జాతీయ సదస్సును ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కళాశాల విద్యా సంచాలకుడు డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్, ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో తాను ముందు ఉంటానని మినీ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. విదేశాల్లో మాదిరిగా హ్యూమన్ లైబ్రరీని ఏర్పాటు చేయాలని, 1948లో ఈ ప్రాంతం స్థాపించిన కోలావర్ కుమార్ సేటు గారిచే పారిశ్రామిక అభివృద్ధి గురించి విద్యార్థులతో చెప్పించాలని సూచించారు. కళాశాల విద్యా సంచాలకులు రాజేందర్‌సింగ్ మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలను పెంపొందించి ప్రపంచదేశాలకు భారతీయ యువతను అందించవచ్చని తెలంగాణ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలుగా ప్రారంభిస్తుందన్నారు. యువతకు నైపుణ్యాలను పెంపొందించి, ప్రపంచంతో పోటీ పడే విధంగా ఇంజనీరింగ్ విద్య మాదిరిగా డిగ్రీ కూడా 4 సంవత్సరాలుగా ఉండి క్యాంపస్ ప్లేస్‌మెంట్ పొందే విధంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీఎస్ఆర్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేసి సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ

బాన్సువాడ టౌన్, జూలై 11: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. గురువారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో కాలుష్యం తగ్గించాలన్నా, వర్షాలు సకాలంలో కురవాలన్నా, గ్లోబల్ వార్మింగ్ తగ్గాలన్నా మొక్కల పెంపకంతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రతీ పౌరుడు బాధ్యతగా భావించి మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్, రవి, మనెమ్మ, హరిప్రియ, రవళి, నరహరి, సభ్యులు తదితరులున్నారు.



టీటీడీ కమిటీ సభ్యులకు గోవును దానంగా అందజేస్తున్న దృశ్యం

టీటీడీ దేవస్థానానికి గో దానం

బీర్కూర్, జూలై 11: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానానికి ఒక భక్తులు గో మాతాను దానం చేశాడు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన అందే సంగమేశ్వర్ అనే భక్తుడు తన సొంత డబ్బులతో గోవును కొనుగోలు చేశాడు. అనంతరం గోవును టీటీడీ దేవస్థానానికి అందజేయాలని తలచాడు. గురువారం గోమాతను ఆలయానికి దానంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు నరసరాజు, ఆలయ ప్రధాన అర్చకులు నంద కిషోర్, టీటీడీ మేనేజర్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కాలని పూజలు

ఎల్లారెడ్డి, జూలై 11: మంత్రివర్గ విస్తరణలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు మంత్రి పదవిలో చోటు దక్కాలని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా ఏడుపాయల వన దుర్గ భవాని మాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి పదవి వస్తే ఎల్లారెడ్డి మరింత అభివృద్ధి చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగం గోపి కృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ

గాంధారి, జూలై 11: మండల కేంద్రంలో భవిత ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. మారుమూల గ్రామాల్లో నరాలతో బలహీనపడుతున్న విద్యార్థులకు ప్రతీ వారం వ్యాయామ చికిత్సలను ప్రత్యేక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఈ వారం కూడా దివ్యాంగులైన పిల్లలకు డాక్టర్ సారిక వ్యాయామ చికిత్సలు అందించారు. ఈ వ్యాయామ చికిత్సలో మొత్తం 8 మంది విద్యార్థులకు చికిత్సలు అందించి వారి వారి తల్లిదండ్రులకు చికిత్సపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ ఉదయం సాయంత్రం దివ్యాంగులైన పిల్లలకు వ్యాయామం చేయించాలని తల్లిదండ్రులకు ఆమె సూచించారు. ఈ పరీక్షలు ప్రతీవారం నిర్వహించబడుతాయని రిసోర్స్ టీచర్‌లు పెంటయ్య, సాయన్న తెలిపారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో..

10 మందిపై పోక్సో చట్టం కింద కేసు

- దేశాయిపేట్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎంఈవో
- హెచ్ఎం తీరుపై విద్యార్థినుల ఫిర్యాదు

బాన్సువాడ, జూలై 11: మండలంలోని దేశాయిపేట్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌పై పోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదైంది. అలాగే ఈ వ్యవహారంలో రాజీ కుదిర్చేందుకు సహకరించిన మరో తొమ్మిది మందిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో నలుగురు ఉపాధ్యాయులు, ఓ పోలీసుతో పాటు మరో నలుగురు ఇతర వ్యక్తులు ఉన్నారు. కాగా.. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బాన్సువాడ సీఐ కృష్ణ హెచ్చరించారు. మరోవైపు.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం దేశాయిపేట్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బాన్సువాడ ఎంఈవో నాగేశ్వర్ రావు సందర్శించారు. హెచ్ఎం తీరుపై విద్యార్థుల వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం తీరుపై ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క విద్యార్థినితోనే కాకుండా పాఠశాలలోని మరో నలుగురైదుగురు విద్యార్థినులను సైతం హెచ్ఎం నరేందర్ ఇదే తరహాలో వేధించినట్టు వారు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు.



మైలారంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

వన మహోత్సవంలో పాల్గొన్న ఎంపీడీవో

నసురుల్లాబాద్, జూలై 11: వన మహోత్సవం సందర్భంగా నసురుల్లాబాద్ మండలం, మైలారం గ్రామంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొన్నారు. అనంతరం కూలీలకు పలు సూచనలు చేసి మొక్కలు పెరిగే విధంగా గుంతలు తవ్వి మొక్కలు నాటాలని ఆమె కూలీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీలావతి, ఎంపీవో రాము, ఏపీవో, టీఏ గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

బీర్కూర్ పాఠశాలలో వన మహోత్సవం

బీర్కూర్, జూలై 11:భవిష్యత్తు తరాలకు మంచి భరోసా ఇవ్వాలంటే మొక్కలు నాటాలని నాయకులు అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు, అధికారులు, పాఠశాల సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఈ ఏడాది వేలాది మొక్కలు నాటుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్వరాజు పటేల్, రఘు, గంగారాం, అహ్మద్, సందీప్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నాటు విధానంపై విద్యార్థులకు అవగాహన

దోమకొండ, జూలై 11: పంట పొలాల్లో వరి నాటు వేసే విధానంపై గురువారం దోమకొండ మండల కేంద్రంలోని అభ్యుదయ పాఠశాల విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయురాలు నిహారిక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థులు పొలంలో రైతులు చేసే సాగు విధానాన్ని వివరిస్తూ ఆ నారుమళ్లు ఏ విధంగా మొలకెత్తి ధాన్యం వస్తుందనే దానిపై వివరించారు. విద్యార్థులతో వరి నాటును వేయడంను సైతం వారితో ప్రత్యేకంగా వేసి చూపించారు.

నీటి సౌకర్యం ఉంటేనే వరి నాటండి

- ఏడీఏ లక్ష్మీప్రసన్న

బిచ్కుంద, జూలై 11: వర్షాకాలంలో వర్షపాతం తగ్గినందు వల్ల వరి సాగు చేసే రైతులు నీటి సౌకర్యం ఉంటేనే నాట్లు వేయాలని వ్యవసాయ అధికారి ఏడీఏ లక్ష్మీప్రసన్న అన్నారు. గురువారం మండలంలోని పుల్కల్ గ్రామంలో సాగవుతున్న వరి పంటలను పరిశీలించారు. బోరు బావులు నీటి సరఫరా ఆధారంగానే ఎన్ని ఎకరాలకు సరిపోతుందో అంతే నాట్లు వేయాలని సూచించారు. అనుకూలించి వర్షాలు భారీగా పడితే ముదిరిపోయిన పెరిగిన నారుపైన తుంచి వేసి నాటు వేయాల్సి ఉంటుందని తెలిపారు. సోయా, మినుములు, పెసర, కంది తదితర పంటలు సాగు చేసే రైతులందరూ తప్పకుండా అందుబాటులో ఉన్న వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఏఈవో దయానంద్, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్

కామారెడ్డి టౌన్, జూలై 11: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్ తెలిపారు. గత ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉంచగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రాక కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా గత ప్రభుత్వం విడుదల చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వమైనా విడుదల చేస్తుందనుకుంటే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవని అన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మణికంఠ, నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

పెద్ద కొడప్‌గల్, జూలై 11: ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పెద్ద కొడప్‌గల్, ఏఎస్ఐ రాములు సూచించారు. గురువారం మండలంలోని పోచారం గేట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీంతో పాటుగానే వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సాయిశివ, అంజి, రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనుల నిర్వహణ

పెద్ద కొడప్‌గల్, జూలై 11: వానాకాలం ప్రారంభం అయినందున అంటురోగాలు ప్రబలకుండ పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు ఖండేబల్లూర్ పంచాయతీ కార్యదర్శి భరత్ తెలిపారు. గురువారం గ్రామంలో గల మురికి కాలువలు పంచాయతీ వర్కర్లచే శుభ్రం చేయించారు. గ్రామంలో గల మురికి కాలువలు శుభ్రం చేయడంతో పాటు, పిచ్చి మొక్కలు లేకుండా తొలగిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మురికి కాలువలు శుభ్రం చేసి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పంటలకు పురుగు మందుల పిచికారీ

పెద్ద కొడప్‌గల్, జూలై 11: జుక్కల్ నియోజక వర్గంలోని పెద్ద కొడప్‌గల్, మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ మండలాల్లో ఖరీఫ్ సీజన్ కింద రైతులు అధిక శాతం ఆరుతడి పంటలు సాగు చేశారు. ఇందులో ముఖ్యంగా సోయా, పత్తి పంటలను సాగు చేశారు. చిన్న పాటి వర్షాలు కురియడంతో పంటలన్నీ కళకళలాడుతునాయి. దీంతో ఆయా మండలాల్లో రైతన్నలు గడ్డి మందుతో పాటు, ఎటువంటి చీడపీడలు వ్యాపించకుండా ముందస్తుగా పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పంట చేలల్లో పురుగు మందును స్ప్రే చేస్తూ రైతన్నలు బిజీగా మారారు.

మొక్కజొన్న పంటపై మొగి పురుగు

పెద్ద కొడప్‌గల్, జూలై 11: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతన్నలు ఖరీఫ్ సీజన్ కింద సోయా, పత్తి పంటతో పాటు మొక్కజొన్న పంటను అధిక మొత్తంలో సాగు చేశారు. మొక్కజొన్న పంట పెరుగుతుండటంతో ఈ పంటకు మొగి పురుగు ఆశించి పంటను తినేస్తుంది. దీంతో ఆకులతో పచ్చగా ఉండాల్సిన మొక్కజొన్న పంట ఆకులు లేకుండా మొండి కాడలతో దర్శనమిస్తోంది. ఎన్నో ఆశలతో పంటను సాగు చేసిన రైతన్నలకు మొక్కజొన్న పంటపై మొగి పురుగు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాముకాటుతో రైతు మృతి

నిజాంసాగర్, జూలై 11: మండలంలోని గిర్నీ తండాకు చెందిన కడావత్ శంకర్(47) వ్యవసాయ పనులు చేసుకుంటుండగా, పాము కాటు వేయడంతో పక్క పొలం వారు గమనించి, చికిత్స కోసం బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా, మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు రమేష్ అన్నారు. గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పరిష్కరించకపోతే భవిష్యత్తులో కార్మిక వర్గం పెద్దఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు లక్షల్లో వేతనాలు తీసుకుంటూ గ్రామపంచాయతీ కార్మికులకు ఆకలితో అల్లాటింపచేయడం తగదన్నారు. వెంటనే కార్మికులు తగిన న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, కిషోర్, సురేష్, దామోదర్, కిషోర్, గోపాల్, వెంకట్, రాజాం, సైదులు, లక్ష్మణ్, బాల్‌రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	కల్కి
ప్రియా 70	కల్కి

బాన్సువాడ	
మహేశ్వరి	కల్కి
వెంకటేశ్వర	మహారాజ

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

